నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గురువారం
30 జనవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు




## అన్నా క్యాంటీన్లపై
# పెదవి విరుపు!

- సర్వే వెలుగులో పలు లోపాలు
- పర్యవేక్షణ, నిఘా లోపం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిశ్రమ స్పందన
- సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రభుత్వానికి నివేదిక అందజేత
- టిఫిన్, రెండు పూట్ల భోజనానికి నిర్వాహకులకు రూ.75 చెల్లిస్తున్న ప్రభుత్వం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికగా భావిస్తున్న అన్న క్యాంటీన్లపై రాష్ట్ర ప్రభుత్వమే సర్వే చేస్తున్నట్లు తెలిసింది. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నిర్వహించిన సర్వేలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక సర్వే సమస్త ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు పలు జిల్లాల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. కోస్తా జిల్లాల్లో అన్న క్యాంటీన్లపై ఎక్కువ శాతం సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొన్నిచోట్ల చిన్నచిన్న లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అన్నా క్యాంటీన్ల పర్యవేక్షణకు ప్రత్యేక డిపార్ట్మెంట్ లేకపోవడంతో భోజనశాలల్లో సమయపాలన లేదనే అభిప్రాయం ఎక్కువమంది వ్యక్తం చేస్తున్నారు. అన్నా క్యాంటీన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సుమారు రూ. 200 కోట్లు ఖర్చు చేస్తోంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనానికి కస్టమర్లు చెల్లించే (మూడు పూటలా).రూ.15తో పాటు ప్రభుత్వం ఒక్కొక్కరికి మూడు పూటలా కలిపి అదనంగా రూ. 75 చెల్లిస్తోంది. అన్నంతో పాటు పెడుతున్న పప్పు, కూర, పచ్చడి కూడా సాంబార్ లా ఉంటోందని పలువురు సర్వే లో వెల్లడించినట్లు తెలుస్తోంది. మజ్జిగ కన్నా పలుచగా ఉన్న నీళ్లను పెరుగు లా. గుంటూరులోని అన్నా క్యాంటీన్లలో ఇస్తున్నట్లు తెలుస్తోంది. పలుచోట్ల అన్నం క్వాలిటీ తగ్గినట్లు చెబుతున్నారు. తాగునీటి వసతి, పరిశుభ్రత లో లోపాలు ఉన్నట్లు దీనిపై నిత్య పర్యవేక్షణతో పాటు ప్రత్యేక నిఘా ఉండాలని పలువురు కోరుతున్నారు..

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వాటిలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ ఒకటి. పేదల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో ఆర్థిక భారం లెక్కచేయకుండా ఈ పథకాన్ని నిర్వహిస్తున్నారు.

**అన్నా క్యాంటీన్లపై సర్వే.. వెలుగులోకి సంచలన విషయాలు**

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రముఖ ఎన్నికల సర్వే సంస్థ రాష్ట్రంలోని 25 జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన సర్వేలో ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో అన్నా క్యాంటీన్ల నిర్వహణలో అనేక లోపాలు వెలుగులోకి రాగా, సెంట్రల్ ఆంధ్రాలోని లబ్ధిదారులు క్యాంటిన్ల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తమైనప్పటికీ పర్యవేక్షణ, సమయ పాలన లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పీపుల్స్ పల్స్ నివేదించింది. అన్నా క్యాంటీన్ల పర్యవేక్షణకు ప్రత్యేక డిపార్ట్మెంట్ లేకపోవడం కూడా ప్రభుత్వానికి ఆశించిన ప్రయోజనం కల్పించడం లేదని తేలింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వాటిలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ ఒకటి. పేదల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో ఆర్థిక భారం లెక్కచేయకుండా ఈ పథకాన్ని నిర్వహిస్తున్నారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యం, ఆహారంలో నాణ్యత లోపం, ప్రభుత్వం ఈ పథకానికి వెచ్చిస్తున్న నిధులపై తగిన ప్రచారం లేకపోవడం వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా ఎలాంటి మేలు జరగడం లేదని సర్వే నివేదకలో తెలిపింది. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, అన్నా క్యాంటిన్లను తొలుత ప్రారంభించారు. అయితే 2019లో అధికారం కోల్పోయిన తర్వాత అన్నా క్యాంటీన్లు మూతపడ్డాయి. కానీ, చాలా చోట్ల తెలుగుదేశం పార్టీ నేతలు తమ అధినేత ఆశయం కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రైవేటుగా అన్నా క్యాంటీన్లను నిర్వహించారు. ఇప్పుడు ప్రభుత్వం నడుపుతున్న క్యాంటీన్లను టీడీపీ నేతలు ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంటీన్లతో సరిపోల్చి చూస్తే ఎక్కువ శాతం మిగతా 3వ పేజీలో



## గమ్మత్తుగా మద్యం గోడౌన్ల
# ఇన్సూరెన్స్ టెండర్

- పోటీ లేకుండా షీల్డ్‌కు ధారాదత్తం
- లోగుట్టు వాసుదేవ, విజయ రెడ్డిలకే ఎరుక ?
- వీడని వైసిపి మత్తు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ పాలక యంత్రాంగం.
- మంత్రి దృష్టికి వెళ్లినా స్పందించని అధికారులు

**మంగళగిరి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజీస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో గత ప్రభుత్వ అవినీతి మత్తు వదలిపెట్టటం లేదు. ప్రభుత్వం మారి ఏడు నెలలు గడిచినా ఇంకా ఏపిఎస్బిసిఎల్ లో తెరవెనుక వాసుదేవుని ప్రభావం కనిపిస్తుంది. వాసు దేవుని బంధువు విజయరెడ్డికే రాష్ట్ర మద్యం గోడౌన్ల ఫైర్ ఇన్సూరెన్స్ టెండర్ ఖరారు కావటం చర్చనీయాంశంగా మారింది. స్టేట్ బేవరేజీస్ పరిధిలోని 29 మద్యం మిగతా 3వ పేజీలో

## ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ మీ కుటుంబానికి
# ఆనందాన్ని ఇచ్చే గ్రీన్ సిగ్నల్

- కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి
- జాతీయ రహదారి భద్రతా మావోత్సవాల్లో పాల్గొన్న మంత్రి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వాహనదారులకు ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ మీ కుటుంబానికి అనందం ఇచ్చే గ్రీన్ సిగ్నల్ అని, శిరస్త్రాణం (హెల్మెట్) ధరించటం ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళే కిరీటం అని, చేతిలో ఉండే డ్రైవింగ్ చక్రం మీ జీవితాన్ని కాపాడే సుదర్శన చక్రం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శాసనసభ్యులు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, మిగతా 3వ పేజీలో






## మిర్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ

**నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడి**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్రం వ్యాప్తంగా, ప్రధానంగా గుంటూరు జిల్లా మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, దిద్దుబాటు చర్యలకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ నెల 12న సీఎం కి మిర్చి రైతుల సమస్యలపై లేఖ రాయటంతో పాటుగా.. మంగళవారం జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మరోమారు సీఎం దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని, మార్కెట్ ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారని, మిర్చి ధరల క్షీణత, ఉత్పత్తి వ్యయాలు, తెగుళ్ల ప్రభావం వంటి అంశాలపై సమగ్ర పరిష్కార చర్యలు త్వరలోనే అమలులోకి రానున్నాయని వెల్లడించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మిర్చి రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు.. గత ఏడాదితో పోలిస్తే ఈ మిర్చి వంగడాలకు క్వింటాలు కి సగటు ధర సగానికి పైగా తగ్గిందని, ప్రీ-సీజన్ అమ్మకాల సమయంలో ఈ గణనీయమైన తగ్గుదల ఉంటుందని, ఫిబ్రవరి మిగతా 3వ పేజీలో

# పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఏపీ సర్కారు సీరియస్

## ఆరోపణలపై నిగ్గుతేల్చాలని విచారణకు 'పవన్ కళ్యాణ్' కీలక ఆదేశం



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అటవీ భూములు ఆక్రమించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. పుంగనూరు నియోజకవర్గం పులిచర్ల మండలం మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో భూ అక్రమాలకు పాల్పడినట్టుగా ఆరోపణలు వెల్లువెత్తిన క్రమంలో ఏపీ సర్కార్ బుధవారం స్పందించింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చిన ఆరోపణలపై స్పందించిన డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ భూములు ఆక్రమించినవారిపై చట్టపరంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్)తో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అటవీ భూములు ఏ మేరకు ఆక్రమించారు, అక్కడ ఉన్న అడవులను ఏ విధంగా ధ్వంసం చేశారో విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న అటవీ భూముల వివరాలు, వాటి రికార్డులను పరిశీలించాలని, ఏ మేరకు ఆక్రమణలకు గురయ్యాయో నిగ్గు తేల్చాలని తెలిపారు. అటవీ భూముల రికార్డులు ఎక్కడైనా తారుమారు చేశారా? చేసిన పక్షంలో అందుకు బాధ్యులెవరు? తద్వారా లబ్ధి పొందింది ఎవరు అనేది నివేదికలో పేర్కొనాలని కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఆలపాటి గెలుపుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దాం : పెమ్మసాని పిలుపు




**గుంటూరు, మేజర్ న్యూస్ :** టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కూటమి ముఖ్య నేతలతో బుధవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీజేపీ టీడీపీ జనసేన ముఖ్యనేతలు ఆలపాటి ఎమ్మెల్సీ గా విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా, జనసేన నుంచి గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు, దేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యాలరావు కూటమి ప్రధాన నేతలు. హాజరయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వం అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో అధికారంలో వుండబట్టి రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రజలకు అందించడానికి దీక్షతో పనిచేస్తున్నారని చెప్పారు. కూటమిలో ఉన్న బీజేపీ టీడీపీ జనసేన నేతలు ఏకతాటిపై కి వచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నాటి ఎన్నికల్లో ఆలపాటి కూటమి అభ్యర్థికి పూర్తి సహకారం అందించి 50వేల మెజారిటీతో తెనాలి సీటును గెలిపించిన సంగతిని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. గుంటూరు జిల్లా ప్రజలకు ఏది కావలన్నామంత్రిగా నేను అందరికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**10 లక్షల కోట్ల అప్పులు**

జగన్ చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా తీసింది. అధికారంలోకి ఏడు నెలల నుంచి జగన్ చేసిన అప్పులకు చంద్రబాబు ప్రభుత్వం వడ్డీలు కడుతూనే ఉంది. అసలు వడ్డీ కలిపి ఏడాదికి రూ. 71 వేల కోట్లు చెల్లిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా, జనసేన, బిజెపి. కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ వాహన ఏర్పాటుకు ప్రణాళిక : కేంద్ర మంత్రి వెల్లడి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పబ్లిక్ ట్రాన్స్ పోర్టు వాహనాలు (సిటిబస్సులు) ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహ్మద్ నజీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి నగరంలో పబ్లిక్ ట్రాన్స్ పోర్టు నిర్వహణ, శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ సమయంలో ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నగర విస్తరణకు అనుకూలంగా ప్రజల రవాణాను పెంచే అవకాశాలను పరిశీలించాలన్నారు. సిటి బస్సు స్టాపుల ఏర్పాటు, స్టాపింగ్ సమయం రెగ్యులైజేషన్ కు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు సిటి బస్సుల సర్వీసులను పెరిగిన నగర పరిధికి అనుగుణంగా సర్వీసులు పెంచేందుకు రవాణాశాఖ, ఆర్టీసీ ప్రతిపాదనలు సిద్ధం చేసి రెండు వారాల్లో అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన రూట్లపై అనుమతుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. నూతన రూట్లలో ఈవీ బస్సులను మాత్రమే నడపాలని ప్రవేటు సిటి బస్సు ఆపరేటర్స్ కు సూచించారు. శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణం సమయంలో ట్రాఫిక్ మళ్లించే రహదారుల మరమ్మత్తులు, అభివృద్ధి , విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సిటిబస్సు రూట్స్ విస్తరణ అనుమతులు రెండువారాల్లో జిల్లా రవాణా కమిటీ సమావేశం నిర్వహించి పరిష్కరిస్తామని, నూతన రూట్ల అనుమతుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు. ప్రవేటు సిటి బస్సు ఆపరేటర్స్ ఈవీ బస్సుల కొనుగోలుకు ఉన్న అవకాశాలపై బ్యాంకర్ లు, ఈవీ బస్సు కంపెనీలు, సీటీ బస్సు ఆపరేటర్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడి, ఆర్టీసీ ఆర్ ఎం కృష్ణకాంత్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తగా వాహనాలు నడపాలి

## యువతకు సూచించిన మన్నవ మోహన్ కృష్ణ



**గుంటూరు మేజర్ న్యూస్:** గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మాట్లాడుతూ మనిషి జీవితం చాలా విలువైనదని రహదారుల భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ ఒక క్రమశిక్షణతో పాటించాలని, అలాగే సీట్ బెల్ట్, హెల్మెట్ పెట్టుకోటం వల్ల ఎన్నో ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. ముఖ్యంగా యువత సేఫ్టీ రూల్స్ పాటించక పోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న మీరు ఒక అవ గాహనతో జాగ్రత్తలు పాటించాలని కోరారు. రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియమాలు పపాటించి సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవాలని మన్నవ మోహనకృష్ణ అన్నారు.

## టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే నసీర్, కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని



**గుంటూరు, మేజర్ న్యూస్ :** సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి పాలనకు ప్రజలతోపాటు ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు పెరుగుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 57వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రిహానా గురువారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కేవలం ఎనిమిది నెలల కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. విజన్ ఉన్న నేత వెంటే నాయకుల తోపాటు ప్రజలు కూడా నడుస్తారని చెప్పడానికి రిహానానే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షేక్ రిహానా మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో చూడని అభివృద్ధి కేవలం ఎనిమిది నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వంలో కనిపించిందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కారణంగానే టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భరత్ రెడ్డి, కోలమూడి నాని, ఎస్ మ్ నిజాం, వేల్పూరి కిరణ్, షేక్ గౌస్, రమేష్, విజయలక్ష్మి, కోటా పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి వివాదంలోకత్తులతో దాడి ఒకరికి గాయాలు




**దుర్గి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దుర్గి మండలంలో ఈ ఘటనా చోటుచేసుకుంది. మండల పరిధిలో ఉన్నా పోలేపల్లి అనే గ్రామంలో నివాసం ఉంటున్న వినుకొండ కాశయ్య మరియు వెంకటేశ్వర్లు(లేట్ )భార్య రమణ కుమారిల కుటుంబసభ్యులమధ్య ఆస్తి పంపిణీ విషయంలో గొడవలు జరిగాయని. ఈనేపధ్యంలోనే కాశయ్య కుమారులు గోపి , వినయ్ లు కత్తులతో రమణకుమారి అన్నయ్యలు జల్లెడ లక్ష్మీనారాయణ, ఏడుకొండల పై దాడిచేశారు. ఈ దాడిలో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం కేసుకట్టి దర్యాప్తు చేస్తున్నము అని కారంపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ టివి. శ్రీనివాసరావు విలేకరుల కు సమాచారం ఇచ్చారు.

## 19, 57వ డివిజన్ కార్పొరేటర్ల నామినేషన్ల ఉప సంహరణ

### స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికల్లో భాగంగా 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహాన, 19వ వార్డ్ కార్పొరేటర్ తేలుకుట్ల హనుమాయమ్మలు తమ నామినేషన్లను ఉప సంహరణ చేసుకున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చే ఎన్నికల అధికారిగా నియమింపబడిన నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటి ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారని, ఈ నెల 30వ తేదీ (గురువారం) మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ఉందన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని, ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.



## స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి ప్రణాలికలు సిద్ధం చేస్తోంది

### కమిటి చైర్మన్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :** పట్టణ పేదల జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, నైపుణ్య అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి ప్రణాలికలు రూపొందిస్తుందని కమిటి చైర్మన్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి సమావేశం జరిగింది. డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), దీన దయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ మార్గదర్శకాల మేరకు నగరాల్లో పేద ప్రజలందరికీ వారి సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా జీవనోపాధిని కల్పించి, ఆయా కుటుంబాల తలసరి ఆదాయం పెంచడానికి నగర కమిషనర్ చైర్మన్ గా ఉన్న సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఉపా సెల్ పిఓ రామారావు, ఎన్ఐ ఎంఎస్ఎంఈ నుండి రాజేంద్ర ప్రసాద్, డిసిపి సూరజ్ కుమార్, ఏఎంహెచ్ఓ రాంబాబు, రవి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ మీ కుటుంబానికి ఆనందాన్ని ఇచ్చే గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)



నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ హెల్మేట్ ధరించటం వలన జుట్టు రాలిపోతుందన్న అపోహ మాత్రమే అన్నారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం (హెల్మెట్) ధరించటం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ప్రమాద సమయంలో సురక్షితంగా ఉండటంతో పాటు దుమ్ముదూళి నుంచి రక్షణ పొందవచ్చున్నారు. జన్యుపరమైన సమస్యలు, కెమికల్స్ వలన మాత్రమే జుట్టు రాలిపోతుందన్నారు. ఎయిర్ ఫ్లో హెల్మేట్ లు వినియోగించటం, తరుచు హెల్మేట్ లు శుభ్రం చేసుకోవటం వలన జుట్టుకు ఎటువంటి హాని జరగదన్నారు. వాహన ప్రమాదాలు 400 జరిగితే 250 మందికి పైగా చనిపోతున్నారని, వాహనాల్లో సీటు బెల్ట్ పెట్టుకోవటం వలన ప్రమాదాలు జరిగినప్పుడు 90 శాతం వరకు రక్షణ ఉంటుందన్నారు. అతివేగంగా వాహనాలు నడపటం, వాహనాలు నడిపేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడకపోతే ఐదు నిమిషాల సమయం మాత్రమే వృధా అవుతుందన్నారు. యువత వాహనాలు అతివేగంగా నడపటం వలన ఫ్యాషన్ కన్నా ప్రమాదాలు ఎక్కువని, రన్నింగ్ రేస్ లో పాల్గొని వారి సామర్థ్యాలు నిరుపించుకోవాలన్నారు. దేశానికి యువతే భావి భారత పౌరులని రహదారులు భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ సురక్షితంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ వాహనదారుల స్వీయ రక్షణ కోసమే రహధారి భధ్రత నిబందనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. యువత రహదారి భద్రత నిబంధనలు ద్విచక్ర వాహనదారులు హెల్మేట్ ధరించటం, కార్లలోప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని, డ్రంక్ అండ్ డ్రవ్ చేయరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలు పాటించకపోవటం వలన ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు. స్పీడ్ థ్రిల్స్ బట్ ఇట్ కిల్స్ అన్నారు. రహదారి ప్రమాదంలో చనిపోవటం హత్యతో సమానం అని, ప్రమాదంలో ఆకస్మాత్తుగా కుటుంబ సభ్యులు ఆకస్మికంగా చనిపోవటం వలన వారి కుటుంబాల పరిస్థితి తారుమారు అవుతాయన్నారు. జిల్లాలో గత సంవత్సర కాలంగా 607 రహదారి ప్రమాదాలు జరిగాయన్నారు. జాతీయ రహదారి సర్వీస్ రహదారి పైనే ద్విచక్ర వాహనాలు ఆటోలు ప్రయాణించాలన్నారు. ద్విచక్ర వాహనం పై హెల్మేట్ లేకుండా ప్రయాణించితే గౌరవ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రూ.1000 అపరాధ రుసుంతో పాటు, మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయటం జరుగుతుందన్నారు. ఈ నిబందనపై గత నెలరోజులుగా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించటం జరిగిందని, ఫిబ్రవరి నెల నుంచి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడారు. శాసనసభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ రహదారి భధ్రత ప్రాధమిక నిబంధనలు పాటించటం వలన వాహనదారులు సురక్షితంగా ప్రయాణిస్తూ అమూల్యమైన ప్రాణాలు కాపాడుకోవచ్చున్నారు. శాసనసభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రహదారి భద్రత నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ పై విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించకుండా అనాలోచితంగా వాహనాలు నడపటం వలనే ప్రమాదాలు జరిగి అమూల్యమైన ప్రాణాలు కోల్పోవటం దురదృష్టకరం అన్నారు. శాసన సభ్యులు తెనాలి శ్రావణ కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలు పాటించ కుండా సౌకర్యం కోసం వినియోగించే వాహనాలను ప్రాణాలు తీసే పరిస్థితికి తీసుకురావద్దని, యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ వాహనాన్ని వెపన్ అపరేట్ చేస్తున్న విధంగా జాగ్రత్తగా భద్రత నిబంధలు పాటిస్తూ నడిపితేనే సురక్షితంగా ప్రయాణం సాధ్యం అవుతుందన్నారు. భద్రత నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ యువత పాటించటం వలన ప్రమాదాలు తగ్గుతాయన్నారు. సమావేశంలో యువత, విధ్యార్థులతో రహదారి భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశం అనంతరం రహదారి భద్రత నిబంధనలపై ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల హెల్మేట్ ర్యాలీని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శాసనసభ్యులు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి జెండా ఊపి ప్రారంభించి, కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో శాసనసభ్యులు బూర్ల సీతారామాంజనేయులు ద్విచక్రవాహనం నడపగా కేంద్ర మంత్రి డా. పెమ్మసాన చంద్రశేఖర్ , శాసనసభ్యులు నసీర్ అహ్మద్, గల్లా మాధవి తో కలసి పాల్గొన్నారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, గుంటూరు ఆర్టీవో సత్యన్నారయణ ప్రసాద్, తెనాలి ఆర్టీవో శ్రీహరి , గుంటూరు, మంగళ గిరి, తెనాలి మోటర్ తనిఖీ అధికారులు, సహాయ మోటరు తనిఖీ అధికారులు మరియు సిబ్బంది, వాహనదారులు, యువత, విధ్యార్థులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్లపై పెదవి విరుపు!

(మొదటి పేజీ తరువాయి)



అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలిపింది.

అన్నా క్యాంటీన్లలో రూ.5కే భోజనం పెడుతున్నారని అక్కడి సిబ్బంది చెబుతున్నా, ప్రభుత్వం అదనంగా ఇస్తున్న మొత్తం ప్రజలకు తెలియడం లేదని తెలిపింది. దీనివల్ల రూ.5కే భోజనం ఇస్తున్నామని క్యాంటీన్ల సిబ్బంది కసురుకుంటున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి మూడు పూటలా భోజనానికి రూ.15తో పాటు ప్రభుత్వం అదనంగా రూ.75 చెల్లిస్తోంది. ఈ విషయంపై ఎవరికీ అవగాహన ఉండటం లేదు. దీంతో క్వాలిటీ తగ్గుతున్న నిర్వాహకులను ఎవరూ ప్రశ్నించలేక పోతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా అన్నా క్యాంటీన్ల పర్యవేక్షణకు ఏ శాఖకు అధికారం లేకపోవడం, అధికారులు అస్సలు తనిఖీలు చేయకపోవడం వల్ల నాణ్యత లోపిస్తోందని చెబుతున్నారు. అన్నా క్యాంటీన్లలో భోజనం కింద అన్నంతోపాటు పప్పు, కూర, పచ్చడి పెడుతున్నా కూర కూడా పప్పు, సాంబారులానే ఉంటుందని లబ్ధిదారులు చెప్పినట్లు సర్వే నిర్వాహకులు చెప్పినట్లు తెలిసింది. అన్నా క్యాంటీన్లను తక్కువ ఆదాయం కలిగిన వారు చక్కగా వాడుకుంటున్నారనేది స్పష్టమైంది. అయితే ప్రభుత్వం తమ కోసం ఎంత ఖర్చు పెడుతున్నదీ తెలియకపోవడం వల్ల ప్రజలకు ప్రభుత్వంపై ఎలాంటి సానుకూల అభిప్రాయం కలగడం లేదని చెబుతున్నారు. అన్నా క్యాంటీన్లపై ప్రభుత్వం ఎక్కువ ప్రచారం చేయాల్సిన అవసరాన్ని సర్వే ఏజెన్సీ స్పష్టం చేసింది. అన్నా క్యాంటీన్ల కోసం ప్రభుత్వం రూ.200 కోట్లు వెచ్చిస్తోంది. దీనిపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు కూడా అవగాహన ఉండటం లేదని, సోషల్ మీడియా ద్వారా ఈ పథకంపై ఇంకా ఎక్కువ ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించింది. వాస్తవానికి రాష్ట్రంలో చాలా పట్టణాల్లో రూ.20 రూపాయలకు ఇడ్లీ, దోశ వంటి అల్పాహారం లభిస్తుంది. కానీ, అన్నా క్యాంటీన్లలో అల్పాహారం కోసం రూ.22 తీసుకుంటున్న నిర్వహణ సంస్థ మెరుగైన, నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదని సర్వే సంస్థ తెలిపింది. ఇక తాగునీరు, శుభ్రత విషయంలో మరింత శ్రద్ధ పెట్టాలని, చాలా చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వెల్లడించింది. అదేవిధంగా చిల్లర సమస్య ఎక్కువగా ఉంటోందని, యూపీఐ చేయమని సిబ్బంది చెబుతుండటం, యూపీఐ చేసే స్థోమత లేనివారే ఎక్కువగా అన్నాక్యాంటీన్లకు వస్తుండటం వల్ల ఆహారం అందక వెనుదిరుగుతున్నారని తెలిపింది. ప్రస్తుతం అన్నా క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం రుచి మెరుగు పరచాలని సూచనలు ఎక్కువగా వచ్చాయి. ప్రజల జిహ్వాకు తగినట్లు ఉప్పు, కారం ఉండటం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా అక్షయపాత్ర ద్వారా భోజనం సరఫరా చేస్తున్నారని, అక్షయపాత్ర వంట శాలలు ఉమ్మడి జిల్లాకు ఒకటి రెండు మాత్రమే ఉంటున్నాయని తెలిపింది. వీటి నుంచి భోజనం సుదూరంలో ఉండే క్యాంటీన్లకు చేరే సరికి చల్లబడిపోవడం, చెడు వాసన రావడం జరుగుతోందని సర్వే తన నివేదికలో తెలిపింది. ఇక వీటికి ప్రత్యామ్నాయంగా కొన్ని సూచనలు చేసింది. నాయకులు తరచూ క్యాంటీన్లలను తనిఖీ చేయాలని, ముఖ్యమంత్రి, మంత్రులు ఆకస్మిక తనిఖీ చేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపింది. అంతేకాకుండా ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు అందజేస్తున్నా తగిన రాజకీయ ప్రయోజనం లభించడం లేదని, ఇందుకోసం స్వయం సహాయక సంఘాలకు క్యాంటీన్ల బాధ్యత అప్పగిస్తే స్థానికంగా ఉపాధి కల్పనతోపాటు మెరుగైన ఫలితం వచ్చే అవకాశాలు ఉన్నాయని సూచించింది. మొత్తానికి ప్రభుత్వం భారీగా డబ్బు వెచ్చిస్తున్నా, రాజకీయంగా ప్రయోజనం దక్కడం లేదని మాత్రం తెలిపింది.

## గమ్మత్తుగా మద్యం గోడౌన్ల ఇన్సూరెన్స్ టెండర్

(మొదటి పేజీతరువాయి)

గోడౌన్లకు సంబంధించి అగ్ని ప్రమాద ఇన్సూరెన్స్ నిమిత్తం ఈ నెల 10వ తేదిన టెండర్ పిలువగా, ఈనెల 21వ తేదితో గడువు ముగిసింది. టెండర్ లో షీల్డ్ బ్రోకింగ్ ఇన్సూరెన్స్ సంస్ద ఒక్కటి మాత్రమే నిలిచింది. మరో బ్రోకింగ్ ఇన్సూరెన్స్ సంస్ద టెండర్ పోటీకి రాకుండే ఉండే విధంగా షీల్డ్ కు అనుగుణంగా నిబంధనలు టెండర్ లో పొందుపరిచారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది ఇన్సూరెన్స్ బ్రోకింగ్ వ్యవస్దలోనూ, ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. మరో సంస్దకు టెండర్ దక్కకుండా ఉండే విధంగా టెండర్ అర్హతలు నిబంధనలు విధించటం లోపాయికారి ఒప్పందాలకు నిదర్శనంగా కనిపిస్తుంది.

**టెండర్ అర్హత నిబంధనలు ఇలా ఉన్నాయి.**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజిస్ కార్పొరేషన్ లిమిటెడ్కు గతంలో ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సంస్ద పని చేసి ఉండాలి. సుమారు ఐదు కోట్లు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాలలో సేవలు అందించి ఉండాలి. ఈ విధంగా మరో సంస్ద టెండర్లో పోటీకి రాకుండా నిబంధనలు పొందుపరిచి ఏకచత్రాధిపత్యంగా షీల్డ్ బ్రోకింగ్ ఇన్సూరెన్స్ సంస్దకు టెండర్ దారాధత్తం చేశారేనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. స్వయంగా సంబంధిత శాఖ మంత్రి వద్దని చెప్పినా అధికారులు మాత్రం షీల్డ్ కు టెండర్ ధారదత్తం చేసేశారు. ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపితే లోపాయికారి ఒప్పందాలుతో పాటు అవినీతి బహిర్గతం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

## మిర్చిరైతుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ

(మొదటి పేజీ తరువాయి)

చివరి నాటికి ప్రధాన పంట సీజన్ అంచనా వేయబడటంతో, క్వింటాలుకు ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా ఒక్కో రైతుకు ఎకరాకు సగటున రూ.60 వేల వరకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని సీఎంకి ఎంపీ లావు వివరించారు. ప్రపంచ మార్కెట్లో మార్పుల కారణంగా మిర్చి ఎగుమతులు తగ్గి, రైతులపై ప్రతికూల ప్రభావం పడిందని, బ్లాక్ థ్రిప్స్ వ్యాధి ప్రభావంతో కొత్త తెగులు వల్ల పంట దిగుబడి తగ్గడంతో రైతుల ఆదాయం మరింత దెబ్బతిందని, ఎరువులు, పురుగుమందుల ధరల పెరుగుదలతో రైతుల పెట్టుబడుల భారం పెరిగిందని.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినపుడు అయన తక్షణమే వ్యవసాయ, మార్కెటింగ్, వాణిజ్య శాఖలను అప్రమత్తం చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు. మిర్చి రైతుల రుణ భారాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటామని, నష్టపోయిన రైతులకు తగిన విధంగా సాయం చేస్తామని, బ్లాక్ థ్రిప్స్ వ్యాధి నియంత్రణ కోసం వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, మార్కెట్ ధరల స్థిరీకరణ కోసం కొత్త విధానాల రూపకల్పన చేయాలని కూడా అధికారులకు ఆదేశిస్తామని తెలిపారని ఎంపీ లావు వివరణ ఇచ్చారు. మిర్చి రైతులకు మేలు చేయడమే కాకుండా, వారి భవిష్యత్తును రక్షించే దిశగా.. సీఎం స్పష్టంగా హామీ ఇచ్చారని వెల్లడించారు.

## 279 మంది ప్రాంగణ ఎంపికలో ఉద్యోగ అవకాశాలు

### మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



**తెనాలి, మేజర్ న్యూస్ :** పేద మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చిదిద్దే విద్యాయజ్ఞంలో ఊహించని విజయాలు సాధించడం గర్వంగా ఉందని ఎఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకున్న విద్యార్థినీ విద్యార్థులను ప్రశంశించారు. ప్రకాశం రోడ్ లోని, ఎ,ఎస్,ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో, శివకుమార్ మాట్లాడుతు మల్టీ నేషనల్ సంస్థ సదర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో అందిపుచ్చుకున్న ఉద్యోగ అవకాశాల విశిష్టతను వివరించారు. తమ కళాశాలలో బీఎస్సీ, బీసీఏ, బీకాం చివరి సంవత్సరం చదువుతున్న, 279 మంది విద్యార్థినీ విద్యార్థులు సదర్ ల్యాండ్ మల్టీ నేషనల్ గ్లోబల్ సర్వీసెస్లో ఉద్యోగాలు అందిపుచ్చుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ 20వ తేదీన సదర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ ప్రతినిధులు కళాశాలకు వచ్చినట్లు తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో డిగ్రీ పూర్తి చేయకముందే, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకున్న విద్యార్థిని విద్యార్థులను, విద్యా సంస్థల చైర్మన్ శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ మల్టీ నేషనల్ సంస్థలో, ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సాధించడం అనేది, సామాన్య విషయం కాదని, ఆ విధంగా విద్యార్థులను తమ సంస్థలో తీర్చిదిద్దుతున్న తీరును వివరించారు. ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకున్న వారికి 2.4, లక్షల నుండి, 2.7 లక్షల వరకు, వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విజేత లైన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## పెదకాకాని సిఐ నారాయణ స్వామికి అభినందనలు తెలిపిన టిడిపి నేతలు



**పెదకాకాని, మేజర్ న్యూస్ :-**

పెదకాకాని సిఐ టిపి. నారాయణ స్వామిని మర్యాద పూర్వకంగా పెదకాకాని టిడిపి నాయకులు బుధవారం కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో అభి నందనలు తెలిపి, వేంకటేశ్వర స్వామి క్యాలెండర్ బహుకరిం చారు. సిఐగా భాధ్యతలు చేపట్టిన నాటినుండి గంజాయి, డ్రగ్స్ మాఫియాలను అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని,గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చే ప్రశంసలు కూడా అందుకున్నారని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత భాధ్యతలు చేపట్టాలని కోరారు. అభినందనలు తెలిపిన వారిలో టిడిపి రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్,మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు బెజ్జం గోపాలకృష్ణ,మండల టిడిపి నాయకులు కోలాటపు మాణిక్యరావు, తెలుగు యువత నాయకులు పంబా నూతన్ పాల్,కోలాటపు బాలు, చందు తదితరులు పాల్గొన్నారు.

# నేటి సమస్యలకు గాంధీయిజమే పరిష్కారం

## డొక్కా మాణిక్య వరప్రసాద్



**గుంటూరు, మేజర్ న్యూస్:**

నేడు భారతదేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి గాంధీయిజమే శరణ్యమని మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 29న గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గాంధీజీ ఆశించిన సమాజం – నేటి పరిస్థితులు అనే అంశంపై జన చైతన్య వేదిక హాలులో జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గాంధీజీ అవసరం గతం కన్నా నేడు ఎక్కువగా ఉందని, హింస, కుల, మత, ప్రాంతీయ తత్వాలు, అవినీతి, వినియోగతత్వం లాంటి సమస్యల పరిష్కారానికి గాంధీయిజం పరిష్కారాలు చూపిస్తుందన్నారు. హింస ప్రతి హింసకు దోవ తీస్తుందని నమ్మి అహింసా సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని కొనియాడారు. గాంధీజీ, నెహ్రూ ల భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడంలో వారిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యం చెందిందన్నారు. గాంధీజీ ప్రభావాలకు భిన్నంగా ధర్మం కోసమని చెబుతూ హింసా మార్గాన్ని చేపట్టడం, ప్రజలను కుల, మత, ప్రాంతాల వారిగా విభజించడం మంచిది కాదన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంబేద్కర్ పీఠం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. శామ్యూల్ ప్రసంగిస్తూ గాంధీజీలో నైపుణ్యం, సేవా గుణం, త్యాగ గుణములు మిళితమై ఉన్నాయని, భారతీయులందరినీ ఏకతాటిపై నడిపిన మహాత్మా గాంధీజీ జన్మదినం అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింస దినోత్సవంగా ప్రకటించారని గుర్తు చేశారు. నేడు దేశంలో భౌతికంగా అంటరానితనం తగ్గినప్పటికీ ,మానసిక అంటరానితనం పెరుగుతుందని, మహాత్మా గాంధీజీ తన జీవితమంతా అంటరానితన నిర్మూలన కోసం, దళితులకు దేవాలయ ప్రవేశం కోసం కృషి చేశారన్నారు. ఈ చర్చా గోష్టిలో నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, కోవిడ్ ఫైటర్స్ ముజీబ్ భాషా, మానవత సభ్యులు అలా అనంతరామయ్య తదితరులు ప్రసంగించారు.

# చదువే జీవం - జీవనం

### - స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా



**గుంటూరు, మేజర్ న్యూస్:**

నవసమాజ నిర్మాతలైన విద్యార్థులపై పెట్టే ప్రతి పైసా పెట్టుబడి కూడా భావి భారత నిర్మాణానికి పునాది అవుతుందని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ అభిప్రాయపడ్డారు. అందుకే శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి నేతృత్వంలో స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా నిరుపేద విద్యార్థుల చదువుకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నట్లు ఆయన చెప్పారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు నగరంలోని భారత్ పేట, ఆర్ అగ్రహారం, సంజీవయ్యనగర్ మున్సిపల్ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యస్‌యస్‌సి న్యూ మోడల్ టెస్ట్ పేపర్ – 2025 పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ఏ మనిషికైనా చదువే జీవం.. జీవనమని స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క విద్యార్థి విధిగా చదువుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తెరిగి మసలుకోవాలని ఆయన సూచించారు. చక్కని గమ్యాన్ని నిర్ధేశించుకుని చిత్తశుద్ధితో గమనం కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భారత్‌పేట స్కూల్ హెచ్‌ఎం సుజాత, ఆర్ అగ్రహారం స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, సంజీవయ్యనగర్ హెచ్‌ఎం ప్రమీల, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు గంగాధరరెడ్డి, సంజీవరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ డైరీ ఆవిష్కరణ



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

నగరంలోని ఆరవ ఏపీ ఎస్పీ బెటాలియన్ లో బుధవారం పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాం డెంట్ కె నగేష్, అడిషనల్ కమాండెంట్ డి ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్లు హను మంతు, వెంకటేశ్వరరావులతో పాటు బెటాలి యన్ అధికారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ సురేష్‌ను అభినందించిన చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు



**వినుకొండ మేజర్ న్యూస్**

ప్రభుత్వ ఉద్యోగులు సమాజ హితం కోరి పనిచేసినప్పుడు ప్రజా హృదయాలలో నిలిచిపోతారని ఆ కోవకు చెందిన వారే వినుకొండ తహసిల్దార్ సురేష్ అని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వర్లు అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నుండి ఉత్తమ తహసిల్దార్ అవార్డును అందుకున్న సురేష్ ను పూలమాలతో చైతన్య స్రవంతి సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సురేష్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మీరు చేస్తున్న సేవల గురించి వింటున్నానని, త్వరలో మీ వృద్ధాశ్రమాన్ని సందర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముఖ్యాని రామయ్య, అందరివాడు సద్దాం, గుమ్మడి పాల్గొన్నారు.

# వంటల పోటీలు



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

నగరంలోని టిప్పర్ల బజార్ నారాయణ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వంటల పోటీలు నిర్వహించారు. మాస్టర్ చెఫ్ నారాయణ ఆధ్వర్యంలో ఈ వంటల పోటీలు నిర్వహించారు. చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీయడంతో పాటు వంటకాలను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఆరోగ్యకరమైన రుచికరమైన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసన్నాంజనేయ పౌష్టికాహారం ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు..ఈ కార్యక్రమంలో ఏజీఎం బీ. రమేష్ రెడ్డి, హై స్కూల్ కోఆర్డినేటర్ జె. శశిధర్, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ బి. మేరీ శ్రావణి,ఈ కిడ్స్ కోఆర్డినేటర్ టి.హెప్సిబా రాణి, ఏ ఓ శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక మధ్యమాలలో ఉన్నత నేతలపై అసభ్య ప్రచారాలు తగదు

**వినుకొండ మేజర్ న్యూస్**

"సామాజిక గౌరవస్థానాల్లో ఉన్న నేతలపై అసత్య ప్రచారం –నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి!" – టిడిపి పట్టణ నాయకులు , – అయూబ్ ఖాన్, షమీమ్ ఖాన్ తదితర నాయకులు.సమాజంలో గౌరవ స్థానాల్లో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేశ్ పై మార్ఫింగ్ ఫొటోలు, అసత్య ప్రచారం, అసభ్య వ్యాఖ్యలతో తప్పుడు పోస్టులు రూపొందించి సోషల్ మీడియా ద్వారా దుర్వినియోగం చేస్తున్న షేక్ గౌస్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూఫేస్‌బుక్ వేదికగా తప్పుడు వార్తలను వ్యాపింపజేస్తూ, వ్యక్తిత్వ హననం చేస్తూ, అసత్య సమాచారాన్ని ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్న ఈ నిందితుడిపై బీఎన్ఎస్ చట్టాలు, సైబర్ చట్టాల ప్రకారం తగిన శిక్ష విధించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ఈ వ్యవహారంపై అయూబ్ ఖాన్, షమీమ్ ఖాన్ తదితర నాయకులు కేసు నమోదు చేయించగా, భవిష్యత్తులో మరెవరూ ఇటువంటి తప్పుడు ప్రచార చర్యలకు పాల్పడకుండా



కఠినంగా వ్యవహరించాలని పోలీస్ మరియు సంబంధిత అధికారులను కోరుతున్నాము. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని, సమాజంలో గౌరవస్థానంలో ఉన్న నాయకుల పట్ల అసభ్య ప్రవర్తనను తట్టుకోబోమని స్పష్టంగా తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పివి సురేష్, కౌన్సిలర్ పత్తి పూర్ణచంద్రరావు , కౌన్సిలర్ గంధం సుబ్బారావు , రియల్ ఎస్టేట్ జానీ, అజిత్ పఠాన్ దస్తగిరి , తోమాటి కాశీశ్వరరావు, పళ్ళ మీసాల దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి అదృశ్యంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు

**మంగళగిరి, మేజర్ న్యూస్:**



నగరానికి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యంపై మంగళగిరి పట్టణ పోలీసు లకు ఫిర్యాదు అందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరం లోని టిడ్కో గృహ సము దాయానికి చెందిన మొక్కల వెంకటరత్నం (74) ఈనెల 20వ తేదీన ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపో యింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా కనిపిం చలేదు. ఈ నేపథ్యంలో ఆమె కుమారుడు చెన్న కేశవ రావు మంగళవారం రాత్రి తన తల్లి వెంకటరత్నం కనిపించడం లేదంటూ మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. వృద్ధురాలు వెంకటరత్నం ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్ స్టేషన్‌కు గానీ, లేక వృద్ధురాలి కుమారుడు చెన్న కేశవరావు సెల్: 7981806003కు గానీ సమాచారాన్ని అందించాలని పట్టణ ఎస్.హెచ్.ఓ డి.వినోద్ కుమార్ కోరారు.

## విద్యార్థులను పరామర్శించిన డీఈఓ చంద్రకళ.

**నూజండ్ల మేజర్ న్యూస్:**





మండలంలోని బుర్రి పాలెంలో బుధవారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడిన సంగతి విదితమే ఈ సమాచారం తెలుసుకున్న పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ వెంట నూజండ్ల మండల విద్యాధికారి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు





**శావల్యాపురం, మేజర్ న్యూస్**

శావల్యాపురం మండలం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షునిగా గుంటుపాలెం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అన్నవరపు వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మిగిలిన ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వర్లును వారు అభినందించి దుశ్శలువాలు ,పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో 15 గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 3న సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవం

**మంగళగిరి,మేజర్ న్యూస్:**

దక్షిణ షిరిడీగా పేరుగాంచిన పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. బుధవారం మంగళగిరి మండలం పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం ఆవరణలో 19వ వార్షికోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ఫిబ్రవరి మూడవ తేదీ 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు కాగడ హారతితో పూజారి కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జబర్దస్త్ కామెడీ షో, హాస్యవల్లరి, సినిమా సంగీత గాయనీ, గాయకులచే సంగీత విభావరి , దూప్ స్టార్ మ్యాజిక్ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కావున భక్తులందరూ సాయినాథుడిని దర్శించి కృపకు పాత్రులు కావాలని నాగభూషణం కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, రామినేని ధర్మ ప్రచారక్, రాఘవయ్య పాల్గొన్నారు.




## చిలువూరు గ్రామంలో పొలం పిలుస్తుంది



**దుగ్గిరాల, మేజర్ న్యూస్**

దుగ్గిరాల మండలపరిధిలోని చిలువూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ను మండల వ్యవసాయ అధికారి పి. శిరీష ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారులతో పాటు మండల పరిధిలోని వివిధ బ్యాంకుల ఫీల్డ్ అధికారులతో పాటు కౌలు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు .ఇప్పటివరకు పంట రుణాలు పొందని రైతులందరూ సకాలంలో బ్యాంకు నుండి పంట రుణాలు పొంది, పంటలు వచ్చిన తదుపరి రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు . కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. శిరీష , లీడ్ బ్యాంకు. మేనేజర్ మహిపాల్ రెడ్డి తెనాలి ఏ డి ఏ ఉషారాణి, ఎం. హరిబాబు, ఎం నాగమల్లేశ్వరరావు, బి. అమ్మి. రెడ్డి ,వివిధ బ్యాంకు శాఖల ఫీల్డ్ అధికారులు, కౌలు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల లైబ్రరీకి విద్యార్థి బహుకరణ



**దుగ్గిరాల, మేజర్ న్యూస్**

దుగ్గిరాల గ్రామంలోని బాలికోన్నత పాఠశాలకు 5వ తరగతి విద్యనభ్యసించే విద్యార్థిని ఉన్నత పాఠశాల లైబ్రరీకి మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుకరించి అభినందనలు అందుకున్నది .గ్రామంలోని బాలికొన్న త పాఠశాలకు 5వ తరగతి విద్యార్థిని మహాత్మా గాంధీ సమగ్ర జీవిత చరిత్రను పాఠశాల లైబ్రరీకి, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఎస్. శోభా దేవికి అందజేసి అభినందనలు అందుకోవడం విశేషం .ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు, చిన్నారిని ఆదర్శంగా తీసుకుని తమ తమ పాఠశాలలో ని లైబ్రరీలకు, కీర్తి ప్రతిష్టలు పొందిన నాయకుల మాలకతీతంగా, జాతీయ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుకరించటం ఎంతో ఆనందదాయకమ నిపిస్తుంది.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఫ... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

# మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్క్

**స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత**

**10.80 ఎకరాల్లో పార్కు ఏర్పాటు**

**365 రోజులూ నేతన్నలకు పని కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :**

మంగళగిరి ఆటో నగర్ ను ఆనుకుని మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత కార్మికులకు 365 రోజులు భృతి కల్పించే లక్ష్యంలో భాగంగా ఆ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బుధవారం మంగళగిరిలోని ఆటోనగర్ కు ఆనుకుని ఉన్న 10.80 ఎకరాలను చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన అయిదేళ్లు చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాలు విక్రయించే మార్కెట్ సదుపాయం లభించకపోవడంతో, ఎందరో నేతన్నలు అప్పుల పాలయ్యారన్నారు. కొందరు చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని విచారం వ్యక్తంచేశారు. టీడీపీ పాలనలో చేనేతలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయం చేనేతకు స్వర్ణయుగమన్నారు. 2014-19లో చేనేతల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నూలు కొనుగోలుకు రాయితీ అందజేశారని, ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారని మంత్రి గుర్తు చేశారు. వాటితో పాటు ముద్ర రుణాలతో పాటు త్రిఫ్ట్ పథకం అమలు చేశారన్నారు. ఆనాటి ప్రయోజనాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను నేతన్నలకు అందివ్వాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ నిర్ణయించారని మంత్రి తెలిపారు.

### చేనేతలకు 365 రోజుల పనే లక్ష్యం

నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు,మంత్రి లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వపరంగా ఆర్థిక దన్ను అందించడంతో పాటు 365 రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేసి, చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో నూతన టెక్స్ టైల్స్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలతో పది నూతన క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ పార్కుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖలో 5 ఎకరాల్లో యూనిటీ మాల్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

### మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు

మంగళగిరిలోని ఆటో నగర్ లో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. 10.80 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తమిళనాడులోని కంచి తరహాలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 365 రోజుల పాటు చేనేత కార్మికులకు పని కల్పించాలన్న లక్ష్య సాధనలో భాగంగానే ఈ హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత జౌళి శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడు, తెల్లబాడు, గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**- ఏవో సుగుణా బేగం**




నూజెండ్ల మేజర్ న్యూస్:- మండలంలోని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఉప్పలపాడు, తెల్లబాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారిణి సుగుణా బేగం, ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంది, వరి, మిరప పంటలను క్షేత్ర సందర్శన చేసి, రైతులతో సమావేశం నిర్వహించారు. హెచ్ఓ నబీ రసూల్ మాట్లాడుతూ మిరప పంటలో తెల్ల నల్లి ఉధృతి వున్నట్లు గమనించారు. నివారణకు స్పైరోమైసిఫెన్ 1 మీ.లి లేదా డైఫెన్తురాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏవో మాట్లాడుతూ రబీ సీజన్ లో సాగు చేసిన పంటలకు సంబంధించి రైతులు ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసి కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. వరి,కంది పంట ఉత్పత్తులు మద్దతు ధర పొందుటకు గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఏలీషా, విహెచ్ఏ తేజస్వి, పశువైద్య సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## డీజీపీ ద్వారకాతిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు



**పిడుగురాళ్ల ,మేజర్ న్యూస్:**

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణంలోని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నందు "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావును, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిను, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ను" గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాస రావు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, పెద్దకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ , యువ నాయకులు యరపతినేని నిఖిల్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

## నమ్మకమైన సేవకు ప్రతిఫలం... ఆనంద కిరీటం

**- దేవుని దయలో ప్రతి ఒక్కరు వర్ధిల్లాలి**





**పెదకాకాని మేజర్ న్యూస్ :-**

క్రైస్తవ ఆధ్యాత్మిక సంఘ అభివృద్ధికి, మానవాళి సంక్షేమానికి చేస్తున్న నమ్మకమైన సేవకు ప్రతిఫలంగా దేవుడు తన దయాకిరీటం, ఆనంద కిరీటం ప్రతి ఒక్కరికి అందజేస్తారని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ అన్నారు.ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో ఫాదర్ ఎం దేవదాసు అయ్యకు దేవుడు బయలపరిచిన 87వ, బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారం ముగిసాయి.ఈనెల 26వ,తేదీ నుండి ప్రారంభమైన మహోత్సవాలు నాలుగు రోజులపాటు దేవునికి మహిమకరంగా, ప్రజలందరికీ దీవెనకరముగా కొనసాగాయని రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ తెలిపారు.ప్రతి ఒక్కరూ దేవుని దయలో వర్ధిల్లాలని, దేవుని కృపకు పాత్రులు కాగలరన్నారు. దైవ ప్రార్థన, దేవుని దీవెనలు, పరిశుద్ధుల ఆశీర్వాదాలతో ఈ సంవత్సరం మహోత్సవాలు ఘన విజయోత్సవ సభగా ముగిసింది అన్నారు. దైవజనులు ఫాదర్ ఎం.దేవదాస్ అయ్య ఆత్మీయ బిడ్డలమైన మనము క్రైస్తవ రాజ్యస వార్తలో నడుం బిగించాలన్నారు. తన వ్యక్తిగత జీవితంలో కూడా దేవదాస్ అయ్య మాట ప్రోత్సాహం ఇచ్చిందని.. నేటి కార్యక్రమాలకు పదును పెట్టిందని సాక్ష్యం ఇచ్చారు.క్రైస్తవ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న బైబిల్ మిషన్ మహోత్సవముల దీవెనలు ప్రతి ఇంటికి చేరాలని ఆకాంక్షించారు. తద్వారా తమ తమ కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లుతారని ఆయన ఆశీర్వదించారు.లక్షల సంఖ్యలో హాజరైన భక్తులు ఉత్సాహం, ఆనందాలతో తమ గృహాలకు క్షేమంగా ఆశీర్వాదాలతో తిరిగి వెళ్లాలని కోరారు.విజయోత్సవముతో, ఆశీర్వాదకరంగా సభ జరగాలంటే ఇప్పటినుంచి ప్రతి ఒక్కరూ ప్రార్థన ధూపంతో పాటు, ఆధ్యాత్మికంగా సిద్ధపడాలని సూచించారు.బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రేవరెండ్ పి. జాన్ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం జాతాను జయప్రదం చేయాలి





**తాడేపల్లి, మేజర్ న్యూస్:**

రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి నినాదంతో గురువారం తాడేపల్లి లో జరిగే జాతాను జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరులో ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి మూడవ తేదీ వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద నుండి జాతా ప్రారంభమవుతుందని అన్నారు. తాడేపల్లి నుండి మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మీదుగా గుంటూరు కు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. రవి, జొన్నా శివశంకరరావు, పల్లె కృష్ణ, దర్శనపు విజయ్ బాబు, నీరుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతయిన మృతదేహం లభ్యం

**నకరికల్లు, మేజర్ న్యూస్:**



నకరికల్లు మండలం బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ లో మహమ్మద్ తాజుద్దీన్ మృతదేహం బుధవారం మధ్యాహ్నం లభ్యమయింది. ఫిరంగిపురం గ్రామానికి చెందిన తాజుద్దీన్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి మంగళవారం రంగురాళ్లు ఏరుకునేందుకు త్రిపురాపురం వద్దకు వచ్చారు. ఏరుకున్న రంగురాళ్లను కెనాలలో శుభ్రం చేసే క్రమంలో కాలంలో జారిపడి తాజుద్దీన్ గల్లంతయ్యాడు. అప్పటికే సమయం సుమారు సాయంత్రం 6:00 అవడంతో. మరుసటి రోజు ఎస్.ఐ.సురేష్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు బుధవారం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటికి తీయడం జరిగింది.

# ఇస్రో వందో ప్రయోగం విజయం చారిత్రాత్మకం

**జీఎస్ఎల్వీ - యఫ్ 15 రాకెట్ విజయం ప్రతీ భారతీయుడికి గర్వకారణం**

**ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ కు, శాస్త్ర వేత్తలకు అభినందనలు తెలిపిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

**గుంటూరు మేజర్ న్యూస్ :**

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన వందో ప్రయోగం సంపూర్ణంగా విజయవంతమవ్వటం ప్రతీ భారతీయుడికి గర్వకారణమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఉదయం శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించిన జీ యస్ ఎల్ వీ - ఎఫ్ 15 రాకెట్ విజయవంతం అవ్వటంతో జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి నేతృత్వంలో అయన స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన జీ యస్ ఎల్ వీ ఉపగ్రహం చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఎన్ వీ యస్ - 02 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ నిర్దేశిత కక్ష్యలోకి విజయ వంతంగా చేర్చిన ఉద్వేగ క్షణాలను ఎవరూ మరచి పోలేరన్నారు. పదేళ్ల పాటు సేవలందించే ఈ ఉపగ్రహం ద్వారా భౌగోళిక , వైమానిక, సముద్ర నావిగేషన్ సేవలు, వ్యవసాయ రంగంలో సాంకేతిక సేవలు



అందనున్నాయన్నారు. భారత భూభాగానికి 1500 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు కూడా సేవలందించేలా శాస్త్రవేత్తలు ఈ ఉపగ్రహాన్ని నిర్మితం చేయటం ద్వారా సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని అయన తెలిపారు. ఇస్రో చైర్మన్గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత చేపట్టిన మెదటి ప్రయోగాన్ని అన్నీ తానై పర్యవేక్షించి విజయవంతం చేసిన వీ నారాయణన్ కు , శాస్త్రవేత్తలకు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వేడుకల్లో ముత్తినేని రాజేష్, దామచర్ల శ్రీనివాసరావు, వడ్రాణం హరిబాబు, బందారు ప్రసాద్ , జాగర్లమూడి శ్రీనివాస్, రాజా ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి

**తెనాలి, మేజర్ న్యూస్**

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, నష్టపరిహారం, సబ్సిడీలు అంతక నష్టపోతున్నారని వారిని ఆదుకు నేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనట్లయితే కౌలు రైతులు వ్యవసాయం మాని కాడి కింద పడేస్తే పంట భూములు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని కాబట్టి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివ సామి రెడ్డి కోరారు. బుధవారం కొలకలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ అధికారి జి ప్రేమ సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ ఉషారాణి మాట్లాడుతూ కౌలు రైతులు నూటికి 70 శాతం ఉన్నారని వారిని ఆదుకునేందుకు రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు ఎక్కడో ఉన్న రైతులు తమ భూముల్ని కౌలుకి ఇచ్చి రైతులకి వారికి పంట రుణాలు పరిహారం ఇవ్వటం న్యాయమని ఆమె తెలిపారు. యూనియన్ బ్యాంకు



మేనేజర్ ఎం రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఓ యజమాని అంగీకారం తో ఇచ్చే ఆమె ద్వారా బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని తెలిపారు రైతు తీసుకుంటే కవులు రైతులకు రుణాలు ఇవ్వటం సాధ్యం కాదని చెప్పారు రైతు మిత్ర గ్రూపులు ద్వారా కూడా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు వీఆర్వో ప్రసన్నకుమారి మాట్లాడుతూ రైతులు అంగీకారం లేకుండా కార్డులు సీసీఆర్సీ కార్డులు ఇవ్వటం సాధ్యం కాదన్నారు పంచాయతీ కార్యదర్శి పుణ్యగంటి జయదేవ్ కూడా మాట్లాడారు రైతులు కౌలు రైతులు తమకున్న సందేహాలను వినిపించటంతో అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

# మంత్రి గొట్టిపాటికి వినతి పత్రం అందజేత

**నూజెండ్ల మేజర్ న్యూస్ :**



ప్రజా వేదికలో జిల్లా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు వినతి పత్రాలు అందజేసిన టిడిపి నాయకులు బుధవారం టిడిపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా మినిస్టర్ గొట్టిపాటి రవికుమార్ కు మండలంలోని వి. అప్పాపురం, తిమ్మాపురం గ్రామాల రైతులు ఇనాం భూముల సమస్యలు పరిష్కరించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని, శ్రీకాళహస్తి నడికుడి నూతన రైల్వే లైన్ నిర్మాణానికి భూములు తీసుకుని 22 ఏ లిస్టులో నమోదయి ఉన్నాయని షాక్ తో తమకు నష్టపరిహారం అందించలేదని కొత్త జడ్డావారి పాలెం నుండి పారా సుబ్బులు,గొట్టిపాటి వెంకటేశ్వర్లు, కట్టంపూడి ధనమ్మలు పిర్యాదు చేశారు , మూర్తింజా పురం మరెళ్ల వారిపాలెం తదితర గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు విద్యుత్ సమితి విద్యుత్ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వహణ సభ్యులు ముంద్రు సుబ్బారావు, ములకలూరు డిసి చైర్మన్ నక్క బలిశ్వర్ రెడ్డి, కంచువాటి నరేష్, అమర వెంకటేశ్వర్లు, నర్రా శ్రీను, పేరం సుధాకర్ రెడ్డి,గుణపాటి రామిరెడ్డి ఆవుల వెంకటేశ్వర్ రెడ్డి, కోట వెంకటేశ్వర్ రెడ్డి, బి రామ చంద్రరావు మందపాటి గురవయ్య, సోమేపల్లి వెంకటరత్నం తదిరులు పాల్గొన్నారు.

# నేడు బ్రెయిలీ జయంతి వేడుకలు

**గుంటూరు మేజర్ న్యూస్:**

జాతీయ అందుల సమైక్య అమరావతి శాఖ ఆధ్వర్యంలో రేపు ఉదయం 9 గంటలకు గుంటూరు క్లబ్లో 216వ లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు జరుగుతాయని ఎన్ ఎఫ్ బి ఐ అమరావతి కార్యదర్శి పి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్వీ రమణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, ఏపీ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ వి బ్రహ్మ రెడ్డి, కన్నా స్కూల్ కరస్పాండెంట్ కన్న బాబు, మానవ హక్కుల కమిషన్ సభ్యులు హనుమంతరావు, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, షిరిడి సాయి దీన జన సేవ సమితి చైర్మన్ ఏ పూర్ణచంద్రరావు, ఎన్ ఎఫ్ బి ఐ ఏ పి స్టేట్ అధ్యక్షుడు ఎస్ నాగార్జున, ఎన్ ఎఫ్ బి ఐ ఏపీ స్టేట్ ప్రధాన కార్యదర్శి ఎం రామసుబ్బయ్య, నేషనల్ సెక్రటరీ కె .నాగేశ్వరయ్య, ఏపీ జనరల్ సెక్రటరీ బి విజయ రామారావు పాల్గొంటారని, ఎన్ ఎఫ్ బి ఐ అమరావతి అధ్యక్షుడు ఎన్ రామకృష్ణారెడ్డి సభ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## విశ్వహిందూపరిషత్ తెనాలి సమావేశం

**తెనాలి, మేజర్ న్యూస్**



విశ్వహిందూ పరిషత్ తెనాలి మండల సమావేశం బుధవారం జరిగింది. సమావేశ లో మాతృశక్తి విభాగం యొక్క ఆవశ్యకతను ధరణికోట శేషారత్నం సమావేశంలో వివరించారు. విశ్వహిందుపరిషత్ మాతృశక్తి ఉత్తరఆంధ్ర సమయోజక తొట్టెంపూడిల సునీతాదేవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో హిందూఆడపిల్లలమీద జరుగుచున్న లవ్ జిహాద్ ఏవిధంగాఎదుర్కోవాలో తెలియజేసారు. నందికంటి జయలక్ష్మి ,మాదాల నాగఅర్చన, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొత్తమాసు పుష్పలత, లక్ష్మీకుమారి నూతనంగా తెనాలి ప్రఖండ్ కార్యవర్గానికి బాధ్యతలను స్వీకరించారు.

# శ్రీనగర్ లో లేగ దూడల ప్రదర్శన

ఈపూరు మేజర్ న్యూస్:- పాడి రైతుల పెంపకందారులు పశువుల పట్ల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం విడనాడి ఎప్పటికప్పుడు స్థానిక పశువుల ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందిస్తే చక్కటి ఆరోగ్యాన్ని పశు వులు పొందుతాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాస మూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని శ్రీనగర్ గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అధిక ప్రాధాన్యత ఇస్తూనిధులు కేటాయిస్తోందన్నారు.పశుపోషకులందరూ ఈ శిబిరాల్లో పశువుల జబ్బులకు చికిత్సలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గోగుల సుబ్బయ్య చామంచి కృష్ణారెడ్డి బొల్లా రమేష్ నర్రా కిషోర్ నర్రా రమణయ్య చింత కృష్ణారెడ్డి పశువైద్య సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

# పిడుగురాళ్లలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్:**

పిడుగురాళ్ల పట్టణంలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవం మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చైల్డ్ కమిషన్ నెంబర్ భక్తుల పద్మావతి హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో అత్యధికంగా విద్యార్థుల పాఠశాల పరిధిలోనే ఆగిపోతుంది. పిల్లలకు అన్ని రకాల సంబంధించిన సమస్యలు కూడా ఇక్కడే ఉన్నవి. చాలామంది ఈ హైస్కూల్లో చదివి ఉన్నత చదువులు అభ్యసించిన వారు ఉన్నారు. చిన్నారుల మోహంలో చిరునవ్వులు చిందించాలి, ఆ చిరునవ్వులు లైఫ్ లాంగ్ ఉండాలి, సమాజంలో మహిళలు ఆడపిల్లలను చదివించటంతో పాటు వారి స్వీయ రక్షణకై విద్యార్థులకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న ఇవేదింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంచాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిరాశ్ర లైన ఆడపిల్లలకు, మహిళలకు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి శాఖ వారు నిర్వహిస్తున్న హోమ్స్ ఉన్నాయని తెలిపారు.




ఆడపిల్లలకు మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 100,1098,181,112 హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. పాలకులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తంగా వన స్టాప్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చైల్డ్ కమిషన్ నెంబర్ బత్తుల పద్మావతి, హెచ్ఎం ఎల్ ధనలక్ష్మి , ఐసిడిఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, హై స్కూల్ స్టాఫ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే జీవితం సుఖమయం

**రోడ్డు భద్రత ఉత్సవాల ర్యాలీలో ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే జీవితం సంతోషంగా సాగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదాల కారణంగా వేల కుటుంబాలు నిర్వీర్యం అయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారే ప్రాణాలు కోల్పోయారని వాపోయారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో గాయాలపాలై, మరణాలు సంభవించిన కుటుంబాలు ఎన్నో తీవ్ర వేదనకు గురవుతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. హెల్మెట్ ధారణ సీటు బెల్టు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమీక్షల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రోడ్డు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కుంభమేళాలో తొక్కిసలాట బాధాకరం : డిప్యూటీ సీఎం పవన్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలో 20 మంది వరకు యాత్రికులు చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈ తొక్కిలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని, 20 మంది చనిపోవడం ఆవేదనకు గురి చేసిందన్నారు. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఇదొక దురదృష్టకర ఘటన అని పవన్ పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లిన వారు అధికారుల సూచనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తొక్కిసలాటలో చనిపోయిన మృతుల కుటుంబాలకు జనసేనాని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# ప్రతి వీధికీ అభివృద్ధి తిలకం : ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

- ప్రతి రోజూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి గడపకూ అభివృద్ధి తిలకం దిద్దుతున్నామని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 56వ డివిజన్ నెహ్రూ నగర్ లో రూ. 67.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఆర్ సీసీ కల్వర్టులు, 23.8 లక్షలతో వాటర్ పైప్లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. చినుకు పడితే చాలు అడుగు తీసి అడుగు వేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు వంటి విజన్ ఉన్న నాయకుడు రాష్ట్రానికి సీఎంగా ఉంటే ప్రతి కాలనీల్లో కష్టాలనేవి కనిపించవని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికంగా రాష్ట్రం ప్రగతి పథాన నడుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిన పరిశ్రమలు సైతం మళ్లీ ఏపీ వైపు చూసేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. నమ్మకమైన నాయకుడు ఉంటే పెట్టుబడులు తరలివస్తాయని చెప్పడానికి చంద్రబాబు నిదర్శనమని అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రణాళికాయుతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, అన్ని కాలనీల్లో అభివృద్ధోదయం జరుగు తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి వాణి, కార్పొరేట్ అయిశెట్టి కనకదుర్గ, బత్తిన శంకర్, ఎర్రగోపు నాగేశ్వరావు, సముద్రాల గణేష్,మన్నం వంశీ, వేములకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపల్లి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు: జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) — బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు — గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) — స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
జి.హిరణ్మాయి (కన్నల్) — నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
శేషగిరి రాజు — మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు — గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు — సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951
చెవుల రంగారావు — మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ — మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ — తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య — వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
వి.లూథర్ — నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078
జి.ఏలియా — ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు — రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ — దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు — పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు — రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ — ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ — నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ — శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి — నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
బి.గురవయ్య — వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426
వి.లక్ష్మీనారాయణ — రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075
పి.వెంకటేశ్వర్లు — దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ — వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
పి.మణికంఠ — మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ — మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898
ఎం.కోటేశ్వరరావు — మాచవరం రిపోర్టర్ సెల్: 6303775169
డి.మల్లికార్జునరావు — యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441
రమేష్ — క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828
ఎస్.విజయభాస్కర్ — గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ — నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
పి.ఆనంద్ — వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
నాగరాజు — మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913
రమేష్ — నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600

"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.

# ప్రజలు వైకాపా ప్రభుత్వాన్ని తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదు: జీవీ

## అప్పులు, పెండింగ్ బకాయిలతో జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు: జీవీ



**వినుకొండ మేజర్ న్యూస్**

అరాచకాలు, దుర్మార్గాలు, అవినీతి, దోపిడీ పాలన సాగించిన వైకాపా ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదని నిప్పులు చెరిగారు ప్రభుత్వ చీఫ్ విప్ , వినికొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. 2014-19 మధ్య చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, ఆదాయం, ఉద్యోగాల కల్పనలో నెంబర్-1 నిలిపితే, జగన్ ఐదేళ్లలో పదిన్నర లక్షల కోట్లు అప్పులు, అవినీతితో అధోగతి పాల్జేశారని మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ పెట్టి పోయిన రూ.22వేల కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించామని, అయినా ఇంకా తమపై బురదజల్లాలని చూడడం దుర్మార్గామని చురకలు వేశారు. బుధవారం ఈ మేరకు వినుకొండలో మీడియా సమావేశం నిర్వహించిన చీఫ్విప్ జీవీ జగన్ చేసిన అప్పులు, పెట్టిన పెండింగ్ బకాయిల గురించి వివరించారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ప్రతిపథకం అమలు చేస్తామన్నారు. సీఎంగా చంద్రబాబు ఉన్నారుకాబట్టి జగన్ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని తట్టుకుని తిరిగి సంక్షేమం, అభివృ ద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. జగన్‌కు నిజంగా సిగ్గుశరం ఉంటే.. డిగ్రీ విద్యార్థులకు రూ. 2,832 కోట్లు, చిక్కీలు, కోడిగుడ్లకు రూ.256కోట్లు, వసతి దీవెనకు రూ. 989 కోట్లు, ఆరోగ్య శ్రీకి రూ.1800 కోట్లు, ధాన్యానికి రూ. 1600 కోట్లు, ఉద్యోగులకు రూ.20వేల కోట్లు, సాగునీటి కాంట్రాక్టర్లకు రూ. 19వేల కోట్లు, గృహనిర్మాణానికి రూ. 7,800 కోట్లు, ఉపాధి హామీకి రూ. 2, 100 కోట్లు ఎందుకు బకాయి పెట్టారని నిలదీశారు. జగన్ కేవలం తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించాడని, విధ్వంసకర ఆర్థిక విధానాలతో రాష్ట్రాన్ని రుణాల విష వలయంలోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ రుషికొండ ప్యాలెస్ కోసం రూ.వందల కోట్లు ఖర్చు పెట్టారని, సొంత పత్రిక, టీవీకి యాడ్లకు, వైకాపా కార్యకర్తలు, సోషల్ మీడియా టీమ్, సాక్షి ఉద్యోగులకు రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి దోచుకున్నారని, కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వలేక పోయారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పౌరసేవల సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకుండా పస్తులు ఉండేలా చేశారని, వైసీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా సిబ్బందికి మాత్రం జీతాలు చెల్లించారని, దీనికి ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఫలితంగానే రాష్ట్ర బడ్జెట్ మొత్తమే 3 లక్షల కోట్లు అయితే జగన్ చేసిన అప్పులకు ఏడాదికి 71వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. తెచ్చిన లక్షల కోట్ల అప్పుల్లోనూ కేవలం కాగితాలపై ఖర్చులు చూపించి దారి మళ్లించు దోచుకున్నారని , అందుకే జగన్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎంతో తాపత్రయ పడుతున్నారని తెలిపారు. దావోస్ యాత్ర చూసిన తర్వాత ప్రతిఒక్కరికీ అర్థమవుతుందని, మన గురించి మనం గొప్పలు చెప్పుకోవడం కాదని, పక్కన ఉన్న తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని, ఆయన చెప్పిన వాస్తవాలను తెలుగురాష్ట్రాల్లో ఉన్న ప్రజలంతా గమనిస్తున్నారని వెల్లడించారు.

## ఉపాధ్యాయులందరూ టిఐఎస్ లో వారి వ్యక్తి గత లాగిన్ ద్వారా నమోదు చేసుకోవాలి

**గుంటూరు మేజర్ న్యూస్ :**

పాఠశాల విద్యాశాఖా డైరెక్టర్ ఆదేశాలు ప్రకారము జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ వారి టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం టిఐఎస్ పూర్తి వివరాలు www.cse.ap.gov.in వెబ్సైటు నందు వారి వ్యక్తి గత లాగిన్ ద్వారా నమోదు చేయుట జరిగినది.జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ టిఐఎస్ లో వారి వ్యక్తి గత లాగిన్ ద్వారా నమోదు చేసిన వివరాలలో ఏవైనా సబ్మిట్ చేసినట్లయితే ఎడిట్ /మార్పులు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖా వారు మరో సారి అవకాశం కల్పించుట జరిగినది. కావున జిల్లాలోని ఉపాధ్యాయులు ఎవరైనా తప్పులు సబ్మిట్ చేసినట్లయితే మరల ఇప్పుడు అప్డేట్ చేసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖధికారి గుంటూరు వారు తెలియజేసినారు. ది: 30.01.2025 సాయంత్రం 5.00 గంటలు లోపు మార్పులు చేసుకోవాలన్నారు.

## చౌడవరం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలి

**- నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**



గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని చౌడవరం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చౌడవరం లోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చౌడవరం రాజీవ్ గృహకల్పలో నివశించే ప్రజలకు నగరపాలక సంస్థ నుండి మౌలిక వసతులు కల్పించాలన్నారు. గృహకల్ప బ్లాక్ ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 2 రోజుల్లో చుట్టూ ఉన్న జంగిల్ క్లియర్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గృహకల్ప ప్రాంతంలోని బోర్లు మరమత్తులు చేయాలని, అవసరమైతే నూతన మోటార్ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం జరగాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ని, కార్యదర్శిని ఆదేశించారు. అలాగే రోడ్ల మీద, అపార్ట్మెంట్ ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలన్నారు. తొలుత శ్రీనివాసరావుతోట ప్రజారోగ్య మస్టర్ పాయింట్ ని పరిశీలించి, ప్రజారోగ్య విభాగంలో సూపర్వైజర్ల పోస్ట్ లు లేవని, డివిజన్ పరిధిలో సూపర్వైజర్లు ఉన్నారని ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసి, ఇప్పటి వరకు ఆ పేరుతో ఉన్న వారికి పారిశుధ్య పనులు కేటాయించాలని, లేకుంటే ఇన్స్పెక్టర్ల పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పర్యటనలో డిఈఈ సతీష్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తాడుట్ల రీ సర్వే పై గ్రామసభ

**తాసిల్దార్ క్షమారాణి**



**మాచవరం మేజర్ న్యూస్**

మండలంలోని తాడుట్ల గ్రామంలో రీ సర్వే పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగిందని తాసిల్దార్ ఎం క్షమారాణి అన్నారు. ఈ సందర్భంగా వేమవరం మొర్జంపాడు గ్రామాల్లో గ్రామసభ, నిర్వహించి ప్రజలకు రైతులకు అవగాహన కోసం ర్యాలీ లు నిర్వహించడం జరిగిందని ఆమె అన్నారు. తాడుట్ల రిసర్వై గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కలుగుతుందని ఆమె అన్నారు. డిప్యూటీ తాసిల్దార్ ఎం.కే.ఎస్. స్రవంతి మాట్లాడుతూ రీ సర్వే పై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సాల్మన్ రాజు, ఆర్. ఐ . కె.కోటేశ్వరరావు, తాడొట్ల వీఆర్వో కే నాంచారయ్య, మండలంలోని వీఆర్వోలు, తాడుట్ల సర్వేయర్ తరుణ్ , మండలంలోని సర్వేయర్లు రెవిన్యూ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిడిఎంప డాక్టర్ పి.సంపత్ కుమార్ ని కలిసివచ్చిన కమిషనర్

**గుంటూరు మేజర్ న్యూస్ :**



ఇటీవల సిడిఎంఏ గా భాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.సంపత్ కుమార్ ని బుధవారం కొలను కొండలోని రాష్ట్ర పురపాలక శాఖ కార్యాలయంలోని ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందిస్తున్న గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

## స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి సిటి లైవ్లీహుడ్

**టాస్క్ ఫోర్స్ కమిటి ప్రణాలికలు సిద్ధం చేస్తోంది : కమిటి చైర్మన్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :**



పట్టణ పేదల జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, నైపుణ్య అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి ప్రణాలికలు రూపొందిస్తుందని కమిటి చైర్మన్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సిటి లైవ్లీహుడ్ టాస్క్ ఫోర్స్ కమిటి సమావేశం జరిగింది. నగరాల్లో పేదల జీవితాల్లో వెలుగులు నింపే కృషిలో కమిటి సభ్యులు అంకితభావంతో ఉండాలన్నారు. సమావేశంలో ఉపా సెల్ పిఓ రామారావు, ఎన్ఐ ఎంఎస్ఎంఈ నుండి రాజేంద్ర ప్రసాద్, డిసిపి సూరజ్ కుమార్, ఏఎంహెచ్ఓ రాంబాబు, రవి పాల్గొన్నారు.

## భావితరాలకు చరిత్రను దృశ్యరూపంలో అందించాలి: సిని దర్శకులు రత్నాకర్

**తెనాలి, మేజర్ న్యూస్**



ఐదు ఏళ్ల శ్రమించి తెనాలిలో జరిగిన స్వాతంత్ర ఉద్యమాన్ని పరిశోధన చేసిన ప్రతిఫలమే వీరస్థలి తెనాలి సాధించిన విజయమని సినీ దర్శకులు రత్నాకర్ అన్నారు. హైదరాబాదుకు చెందిన సుమిత్ మీడియా మోర్డ్ ఫౌండేషన్ సంస్థ ఉత్తమ ఫ్రీడమ్ ఫైట్ డాక్యుమెంటరి చిత్రంగా వీరస్థలి తెనాలిని ఎంపికచేసినట్లు రత్నాకర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సత్యన్నారాయణ టాకీస్ రోడ్డు టాలెంట్ ఎక్స్ ప్రెస్ న్యూస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెనాలి సమీపంలోని కంచర్లపాలెం గ్రామనికి చెందిన స్వతంత్ర సమరయోధులు చుక్కపల్లి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన వీరస్థలి తెనాలి చిత్రానికి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ తరపున అవార్డు దక్కడంపై చిత్ర యూనిట్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. బ్రిటిష్ పాలకులను అంతమొందించాలన్న చుక్కపల్లి రామయ్య చేసిన ప్రయత్నం విఫలం కావడంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రామయ్యపై మరణదండన విధిస్తారు. విషయం తెలుసుకున్న ప్రముఖ న్యాయవాది టంగుటూరి ప్రకాశం పంతులు తెనాలి చేరుకుని రామయ్యపై విదించిన ఉరిశిక్ష కేసును వాదించి జీవిత ఖైదుగా మలుస్తారు. ఈ నేపద్యంలో జరిగిన చుక్కపల్లి రామయ్య యదార్థ జీవిత చరిత్రను ఐదేళ్లు రీసెర్చ్ చేసి దృశ్య కావ్యంగా మలిచినట్లు రత్నాకర్ వివరించారు. తెనాలి చరిత్రను వీరస్థలి తెనాలిగా మలిచి ప్రజామన్ననలు పొందామన్నారు. దేశ చరిత్రను దృశ్య కావ్యంగా మలిచిన రత్నాకర్ మీరెన్నో అవార్డులు పొందాలని సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ మాస్టారు అన్నారు. కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, బడుగు మోహనరావు, దర్శి జీవన్ శ్రీ, తులసి, సంజీవరావు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ల ఫెడరేషన్ నాయకులు ఎస్.ఎస్. జహీర్, పట్నాల సాయి, పి. పున్నయ్య, అంబటి శ్యామ్ సాగర్, మునిపల్లి శ్రీకాంత్, ప్రకాశరావు, మహేష్, మదు, వి. భూషణం, శేఖర్, రవికిరణ్, కోటేశ్వరరావు, మేకల సుబ్బారావు, ఫెడరేషన్ సభ్యులు, సినీ కొరియోగ్రాఫర్ అమ్మ సుధీర్, కిరణ్, హేమంత్, కనపర్తి బెన్ హర్, చిత్ర నటీనటులు పాల్గొన్నారు.